# సన్న వడ్లకు బోనస్ రైతులకు వరం

### కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి కలెక్టరేట్, మే 29 : సన్నాలకు బోనస్ రైతులకు వరమని కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం పేర్కొన్నారు. సన్న వడ్లకు బోనస్ రూపంలో రూ.1.72 కోట్లను వెచ్చించి రైతులకు భారీ ఊరట కలిగించిందని చెప్పారు. జిల్లాలో యాసంగి సీజన్ వడ్ల కొనుగోళ్ల వివరాలతో పాటు మూడేండ్లలో జరిగిన సేకరణలు, చెల్లింపుల వివరాలను వివరించారు. జిల్లాలో 2022-23లో 78,824,660 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, 12,913 మంది రైతులకు రూ.129 కోట్ల చెల్లింపులు జరిగాయి. 2023-24లో 1,00,542. 720 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, 14,776 మంది రైతులకు రూ. 126కోట్ల చెల్లింపులు జరిగాయి. 2024-25లో 1,21, 472.080 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, 19,166 మంది రైతులకు రూ.237 కోట్ల చెల్లింపులు జరిగాయని వివరించారు. ఈ ఏడాదిలో సన్న వడ్ల కు బోనస్ కింద అదనంగా రూ.1.72 కోట్లు చెల్లించినట్లు కలెక్టర్ వివరించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అత్యధికంగా ధాన్యం సేకరించడమే కాకుండా రైతులకు అధిక మొత్తంలో చెల్లింపులు జరిగాయని వివరించారు. ముఖ్యంగా సన్నాలకు బోనస్ చెల్లింపులు చరిత్రలో ఒక మైలురాయి గా నిలుస్తుందన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ



జహీరాబాద్‌లోని సాయిబాబా ఎరువుల దుకాణంలో శ్యాంపిల్‌ను సేకరిస్తున్న వ్యవసాయాధికారి లావణ్య

కోహీర్, మే 29 : మండలంలోని కవేలి గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ కొనుగోలు, విక్రయా ల రికార్డులను పరిశీలించారు. మందులపై ఉన్న కాల పరిమితిని క్షుణ్ణంగా పరిశీలించారు. నకిలీ మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో నవీన్ కుమా ర్, ఎస్సై సతీశ్ వర్మ ఆయా దుకాణాల డీలర్లను హెచ్చరించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

**జహీరాబాద్‌లో..**

జహీరాబాద్, మే 29 : జహీరాబాద్ పట్టణంలోని సాయిబాబా ఎరువుల దుకాణాన్ని గురువారం మండల వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణంలోని ఎరువుల దుకాణంలో విక్రయిస్తున్న కంది విత్తనాల స్టాక్ రికార్డులను మండల వ్యవసాయాధికారి లావణ్య పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు తీసుకునే రైతులకు తప్పని సరిగా రసీదులను ఇవ్వాలని సూచించారు. ఎరువులను, క్రిమిసంహారక మందులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణంలో విక్రయిస్తున్న కంది విత్తనాలను శ్యాంపిల్ సేకరించి పరీక్ష నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

**సిర్గాపూర్‌లో..**

సిర్గాపూర్, మే 29 : నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి హరికృష్ణ, ట్రైనీ ఎస్సై మహేశ్ హెచ్చరించారు. గురువారం సిర్గాపూర్‌లో సంయుక్తంగా ఫర్టీలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈమేరకు గోదాంలో నిల్వలు, రికార్డులను కూడా పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ ధ్రువీకరించిన దుకాణాల్లోనే ఎరవులు, విత్తనాలు కొనాలని వారు రైతులకు సూచించారు. అధిక ధరలకు ఎవరైనా పత్తి విత్తనాలు విక్రయిస్తే వారి వివరాలను సమాచారమందించాలని కోరారు.

**వట్‌పల్లిలో..**

వట్‌పల్లి, మే 29 : నకిలీ ఎరువులు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గురువారం వట్‌పల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల యజమానులు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాలలోనే విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయాలని తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు.

## ఈదురు గాలులతో భారీ వర్షం



జోగిపేటలో రోడ్డుపై వర్షం నీరు

అందోల్, మే 29 : అందోల్ మండలంలో గురువారం వాన దంచికొట్టింది. అందోల్-జోగిపేటతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రైతున్నలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు ముందస్తుగా రాడవంతో పొలాల్లో దుక్కులు దున్నుతూ విత్తనాలు కొనుగోలు చేస్తూ బిజీగా గడుపుతున్నారు. కొన్ని చోట్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షం నీరు వచ్చిచేరడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సివచ్చింది. రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది.



గంగ్వార్ చౌరస్తాలో కురుస్తున్న వర్షం

**జహీరాబాద్‌లో మళ్లీ కురిసిన వర్షం**

జహీరాబాద్, మే 29 : జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో గురువారం సాయంత్రం మళ్లీ భారీ వర్షం కురిసింది. నియోజకవర్గంలోని న్యాల్‌కల్, జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంగం మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వరసగా కురుస్తున్న భారీ వర్షాలతో వానకాలం పంటల సాగు ఆటంకం ఏర్పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడ్గి చెట్లకు కాసిన మామిడి పండ్లు నేలరాలిపోవడంతో రైతులు, వ్యాపారులు నష్టపోతున్నారు. కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు, ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతుండడంతో కళకళలాడుతున్నాయి.

## హరితహారంపై గొడ్డలి వేటు



ఊట్ల - జిన్నారం గ్రామాల మధ్య రోడ్డు పక్కన నరికివేసిన చెట్లు

జిన్నారం, మే 29 : ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలు అవుతున్నది. జిన్నారం మండల కేంద్ర శివారులోని నమా జ్గడ్డ ఊట్ల వెళ్లే ప్రధాన రహదారి రోడ్డుకిరువైపులా హరితహారంలో నాటిన మొక్కలు అవి పెరిగి వృక్షాలుగా మారడంతో ట్రాన్స్కో సిబ్బంది చెట్ల కొమ్మలతో పాటు పదుల సంఖ్యలో చెట్లను కొట్టివేయడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. చెట్లను నరికివేసి ప్రభుత్వ ధనం, పర్యావరణానికి నష్టం కలిగిస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బ్రిడ్జి పనుల పరిశీలన



బ్రిడ్జి పనులను తనిఖీ చేస్తున్న రాష్ట్ర క్యాలిటీ కంట్రోల్ శాఖ అధికారి మారుతి

రాయికోడ్, మే 29: రాయికోడ్ మండల పరిధిలోని రాయిపల్లి(సి) గ్రామ శివారులో నిర్మాణం చేస్తున్న బ్రిడ్జి పనులను గురువారం రాష్ట్ర క్యాలిటీ కంట్రోల్ శాఖ అధికారి పర్యటించారు. పీఎంజీఎస్‌వై పథకంలో రూ.1.54 కోట్ల నిధులతో నిర్మాణం చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణం పనులను రాష్ట్ర క్యాలిటీ కంట్రోల్ శాఖ అధికారి ఎన్. మారుతి పరిశీలించారు. అనంతరం పనుల వివరాలను పంచాయతీ రాజ్ శాఖ ఏఈ దేవయ్యను అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి పనులను త్వరగగా పూర్తి చేసి ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఏఈ దేవయ్య అదేశాలు ఇచ్చారు. పీఆర్ డిప్యూటీ ఈఈ కుర్మయ్య, ఏఈ దేవయ్య ఉన్నారు.

## 114వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



నిరాహారదీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మే 29 : ప్యారానగర్ డంపింగ్‌యార్డును రద్దు చేయాలని రైతు జేఏసీ నాయకులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష గురువారం 114వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ వెంటనే డంపింగ్‌యార్డును రద్దు చేయాలని కోరారు. రైతులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సదాశివపేట, మే 29 : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మండల పరిధిలోని గొల్లగూడెం శివారులోని జాతీయ రహదారి పక్కన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

### టీజేఏసీ ఆధ్వర్యంలో నిరసన



అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న టీజేఏసీ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, మే 29 : తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించి కాంగ్రెస్ ఎన్నికల హామీ ని నిలబెట్టుకోవాలని టీజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐబీ వద్ద గల అమరవీరుల స్తూపం వద్ద టీజేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ శాసన సభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా తె లంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇం టి స్థలం కేటాయించి తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభు త్వం ఆధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నెరవేరలేదని దుయ్యబట్టారు. టీజేఏసీ కో చైర్మన్ కుమ్మరి సాయి లు, మల్లయ్య కో-ఆర్డినేటర్ శ్రీధర్ మహేం ద్ర, ఉద్యమకారులు త్రి విక్రంరావు, బందెన్న గౌడ్, గొల్ల రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఐజీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 29 : భారతీనగర్ డివిజన్‌లోని ఎంఐజీలో రూ. 93లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఐజీలో రూ.23.50లక్షలతో నిర్మించిన షెటిల్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీనగర్ డివిజన్‌లోని ఎంఐజీ కాలనీ అభివృద్ధి కృషి చేస్తామన్నారు. కాలనీలో సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.93 లక్షలతో శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాలనీలో ఉన్న సమస్యలను కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువస్తున్నారని, సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో సహకారం అందజేస్తామని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఐజీ కాలనీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఎంఐజీ కాలనీలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

**డివిజన్ అభివృద్ధికి కృషి**

రామచంద్రాపురం, మే 29 : డివిజన్ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను ఆమె ప్రారంభించారు. అనంతరం దోమల నివారణకు మస్కిటో ఫాగింగ్‌ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, గౌస్, సత్యనారాయణ, పాపయ్య యాదవ్, వెంకట్‌రెడ్డి, నందగోపాల్, జాకిర్, జైపాల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలి

సదాశివపేట, మే 29 : ఉపాధి హామీ రోజు కూలీ రూ. 800 పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆత్మకూర్, ఏటిగడ్డసంగం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాలకు పనిని విస్తరింపచేయాలన్నారు. పని ప్రదేశాల్లో మంచినీళ్లు, మెడికల్ కిట్, టెంట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుమార్, శివయ్య, సాయిబాబా, నర్సింహులు, రాములు, చంద్రయ్య, శేఖర్, మల్లికార్జున్, శ్రీశైలం, లక్ష్మణ్, దశరథ్, కడమంచి, రాములు, రత్నయ్య, శంకరయ్య, అంజయ్య, శామమ్మ, రియానా, నాగమణి, పోచమ్మ, కమలమ్మ, అనసూయ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న దాత ప్రసాద్‌రెడ్డి

కోహీర్, మే 29 : మండలంలోని దిగ్వాల్ గ్రామ శివారులో ఉన్న మైసమ్మ దేవాలయానికి సజ్జాపూర్ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి విరాళమందించారు. గురువారం మైసమ్మ దేవాలయాన్ని దర్శించుకొని అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 31 నుంచి జూన్ రెండో తేదీ వరకు నిర్వహించే మైసమ్మ ఉత్సవాలు దిగ్విజయం చేసేందుకు తనవంతుగా రూ. 50వేల నగదును ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయానికి విరాళమిచ్చిన దాత ప్రసాద్‌రెడ్డిని సభ్యులు ఘనంగా సన్మానించారు.

### బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ

రాయికోడ్, మే 29 : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుటున్న బాలికల విద్య పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని శంషొద్దీన్‌పూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యాక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలోని అల్లాపూర్ శివారులో ఉన్న తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న కేజీబీవీ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. అడపిల్లలు చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఆర్ఐ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు ప్రియాంక, చంద్రశేఖర్, ఏఈ సౌమ్య, నాయకులు నర్సిములు, విఠల్ ఉన్నారు.

## పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

అందోల్, మే 29 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్‌మెంట్ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్ డిమాండ్ చేశారు. గురువారం జోగిపేటలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు డీఏను వెంటనే ప్రకటించాలని, కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం విధానాన్ని వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు మొత్తం వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన బాట పడుతామని హెచ్చరించారు. సంఘం నాయకులు సర్వరాజ్, హాజీం, చంద్రశేఖర్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

మనూరు, మే 29 : మద్యం మత్తులో వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్సై శంకరయ్య హెచ్చరించారు. గురువారం మనూరు మండలం మాయికోడ్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. వాహన దారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. హెల్మెంట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపరాదని, ప్రతి ఒక్కరూ హెల్మెంట్ ధరించాలని సూచించారు.

## ఓపెన్ జిమ్‌తో ఆరోగ్యం

### కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



పటాన్‌చెరులో ఓపెన్ జిమ్ పనులు పరిశీస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు, మే 29 : పటాన్‌చెరులోని కృషి డిఫెన్స్ కాలనీ, మైత్రి క్రీడా మైదానంలో నిర్మాణం చేస్తున్న బహిరంగ జిమ్ పనులు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తెలిపారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని కృషి డిఫెన్స్ కాలనీ, మైత్రి క్రీడా మైదానంలో చేస్తున్న పనులను పరిశీలించి, జీహెచ్ఎంసీ అధికారులకు పలు సూచనలు చేశారు. రూ. 40 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో బహిరంగ జిమ్ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. పనులు నాణ్యతగా నిర్మాణం చేపట్టాలని, ఓపెన్ జిమ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఓపెన్ జీమ్‌తో ప్రజలకు ఎంతో ఉపయోగం పడుతుందని తెలిపారు. కార్పొరేటర్ వెంట మైత్రి క్రికెట్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు మనుమంత్ రెడ్డి, నాయకులు రవీంద్రగిరి, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల నడ్డివిరుస్తున్న విత్తనాల ధరలు




జిలుగు విత్తనాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులు

కంది, మే 29 : విత్తన ధరలు పెంచడంతో సాగు చేసేదేలా అంటూ రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. గురువారం కంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో జిలుగు విత్తనాలను విక్రయించారు. ఈ విత్తనాలను కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులు ధరను చూసి షాక్ అయ్యారు. గత ప్రభుత్వంలో 30 కేజీల సంచికి రూ.1100 ఉంటే ఈ ప్రభుత్వంలో రూ.2140 రెండితలకు పెరగడం ఎంత వరకు న్యాయమని వాపోయారు. పాస్ బుక్కుకు ఒక సంచి చొప్పున మాత్రమే విత్తనాలు ఇస్తే ఎలా సాగు చేయాలంటూ ప్రశ్నించారు. ఈ సంచి ఒక ఎకరాకు మాత్రమే సరిపోతుందని, 3-4 ఎకరాలు ఉన్న రైతుల పరిస్థితి ఏమిటని, ఎకరాకు ఒక సంచి విత్తనాలు ఇచ్చేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. రెండింతలు పెంచిన విత్తన ధరలను తగ్గించి ప్రభుత్వం అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

## రెండు బైకులు ఢీ.. ఇద్దరు మృతి

పటాన్‌చెరు రూరల్, మే 29 : రెండు బైకులు ఢీ కొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ తెలిపిన కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లా, కారంపొడి మండలం వైకుంఠపురానికి చెందిన రామాంజనేయులు (35) గుంటూరు జిల్లా అమరావతి, జిడు గు గ్రామానికి చెందిన ప్రభుదాస్ రామచంద్రాపురం మండలం ఈదుల నాగులపల్లిలో నివసిస్తూ మేస్త్రి పని చేస్తున్నారు. గురువారం శంకర్‌పల్లి మండలం కొత్తగూడెం గ్రామంలో మేస్త్రీ పని ముగించుకొని సాయంత్రం రామాంజనేయులు, ప్రభుదాస్ చెరో ద్విచక్రవాహనంపై ఇంటికి బయలు దేరారు. ఓఆర్ఆర్ ఎక్జిట్-2 వద్దకు రాగానే ఎదురుగా రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ప్రభుదాస్ బైక్‌ను ఢీ కొ ట్టింది. దీంతో ప్రభుదాస్ తీవ్రగాయాలకు గురై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో బైక్‌పై వచ్చి ఢీకొన్న రామచంద్రాపురం మండలం సందుగూడెంకు చెందిన వడ్డే నగేశ్ (35) తీవ్రగాయాలు కాగా, పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నగేశ్ మృతి చెందాడు. ఈ మేరకు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పోలీసులు పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు.

## సన్మానం



కొత్తగొల్ల చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సదాశివపేట, మే 29 : ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో కేపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ విజయం సాధించారు. ఈ మేరకు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌ను సన్మానించారు. యూనియన్ జనరల్ సెక్రెటరీ మల్లేశం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నీరుడి సాయిలు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మండల కార్యదర్శి శంకరప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తాజోద్దీన్, షఫీ ఆహ్మద్, నాయకులు నారాయణ, ముజీబ్, రాచయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతులతో సాగు చేస్తే అధిక దిగుబడి




సదస్సులో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి, డీడీఎస్-కేవీకే కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్

జహీరాబాద్, మే 29 : ఆధునిక సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేస్తేనే అధిక దిగుబడులను సాధించవచ్చని వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ జిల్లా నోడల్ అధికారి, జహీరాబాద్ మండలం దిడ్గి డీడీఎస్-కేవీకే కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని గోటిగార్‌పల్లి, గుడుపల్లి, గౌసాబాద్ గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రకృతిని పరిరక్షిస్తూ, వ్యవసాయంలో అధునిక పద్ధతులను అవలంభిస్తూ, అధిక దిగుడులను సాధించవచ్చునన్నారు. కోరమండల్ గ్రోమోర్ సంస్థ ప్రతినిధులు డ్రోన్ సాంకేతిక పద్ధతులతో మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎఫ్ఆర్ఎస్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్రా, జాతీయ చిరుధాన్యాల పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సేవనాయక్, డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

## కవి మొగిలి మాలకు సత్కారం



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నుంచి పశంసా పత్రాన్ని అందుకుంటున్న కవి, ఉపాధ్యాయుడు మొగిలి మాల

జిన్నారం, మే 29 : జిన్నారం మండలం కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవి మొగిలి మాల గురువారం సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి వేడుకల సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తేజం అనే శీర్షికన రాసిన పద్యాలను వినిపించారు. కవి మొగిలి మాలను ముఖ్యఅతిథిగా హాజరైన గుత్తా సుఖేందర్ రెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు శ్రీకృష్ణ వర్ధన్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందించి, సన్మానించారు.

## ఆకట్టుకున్న ఒడిస్సీ, మణిపూర్ నృత్యాలు


సంగారెడ్డి మే 29(నమస్తే తెలంగాణ): ఐఐటీ హైదరాబాద్‌లో స్పిక్‌మాకే పదో సాంస్కృతిక సమ్మేళనం కొనసాగుతున్నది. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. ఐఐటీహెచ్‌లోని లెక్చర్ హాల్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మొదట ప్రముఖ ఒడిశా నృత్యకళాకారులు పద్మశ్రీ దాతుక్ రమ్లి ఇబ్రహీం తన శిష్య బృందంతో ఇచ్చిన నృత్య ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులతో కలిసి దాతుక్ రమ్లి ఇబ్రహీం బసంత రుతు ఒడిశా నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. మహిళా నృత్యకళాకారులు రాధ వేషంలో, ఇద్దరు పురుష కళాకారులు కృష్ణులుగా అభినయం చేస్తూ నృత్యం రూపకాన్ని ప్రదర్శించారు. సూర్యుడు తన గుర్రాలతో రథంపై వస్తున్నట్లు కళాకారులు ఇచ్చిన ప్రదర్శన అందరినీ అలరింపజేసింది. ఆతర్వాత మణిపూర్ కళాకారులు ప్రదర్శించిన పంగ్ చోలోమ్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ మణిపూరి నృత్య కళాకారులు ఖుముక్చన్ రోమింద్రో సింగ్ బృందం పంగ్ చోలమ్‌ను జానపద నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో స్పిక్‌మాకే చైర్మన్ రాధామోహన్ తివారి, ఐఐటీ డైరక్టర్ బీఎస్ మూర్తి, స్పిక్‌మాకే సభ్యులు, ఐఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

## 109లో కొనసాగుతున్న సర్వే

### సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో రవీదర్ రెడ్డి



సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

గుమ్మడిదల, మే 29 : మండల కేంద్రంలోని 109 సర్వే నెంబర్ అసైన్డ్ భూమిని ఇండస్ట్రియల్ పార్కు కోసం కేటాయించడంతో అసలైన లబ్ధిదారులకు పరిహారం అందించడానికి ఆర్డీవో రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో జిల్లా సర్వేయర్లతో రెండో రోజు సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం 109వ సర్వే నెంబర్ అసైన్డ్ భూమిని గతంలో 98 మంది పేద రైతులకు జీవనోపాధి కోసం అప్పటి సర్కారు పట్టాలను అందజేసిన విషయం తెలిసిందే. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు కోసం ఆ అసైన్డ్ భూమిని కేటాయించగా పట్టాలు అందుకున్న రైతులకు పరిహారం అందించడానికి ఏ రైతుకు ఎంత భూమిలో పోజిషన్‌లో ఉన్నారు ? వారికి నిజానికి ఇచ్చిన భూమి ఎంత వంటి వివరాలు తహసీల్దార్ పరమేశం ఆధ్వర్యంలో వివరాలను సేకరిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు.

## వృద్ధుడు అదృశ్యం




నారాయణరావు (ఫైల్)

జిన్నారం, మే 29 : బొల్లారం మున్సిపల్ పరిధిలోని పాతబస్తీకి చెందిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం పాతబస్తీకి చెందిన నారాయణరావు (67) గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరికైనా కనిపించినట్లయితే 9949854361 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

## టీబీ నివారణకు చర్యలు

రామచంద్రాపురం, మే 29 : టీబీ నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్సీపురం పీహెచ్‌సీ డాక్టర్ కల్పన అన్నారు. గురువారం పీహెచ్‌సీలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు టీబీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్పన మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా 60 ఏండ్లు పైబడిన వారికి టీబీ పరీక్షలు చేయనున్నామని వెల్లడించారు.



దవాఖానలో టీబీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది